# ద్రవరూప నానో యూరియాపై అవగాహన పెంచుకోవాలి



కోటపల్లి : ద్రవరూప నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏవో మహేందర్, ఏఈవో రాజ్‌కుమార్

- కోటపల్లి ఏవో మహేందర్

కోటపల్లి, అక్టోబర్ 4 : ద్రవ రూప నానో యూరియా వాడకంపై అవగాహన పెంచుకోవాలని కోటపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి మహేందర్ సూచించారు. కోటపల్లి మండలంలోని పారుపల్లిలో వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన ఏవో మహేందర్, ఏఈవో రాజ్‌కుమార్ రైతులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వర్షాభావ పరిస్థితుల్లో ఘన రూపంలో ఎరువులను అందించడం కన్నా ద్రవరూప యూ రియా ద్వారా అందించడం ఉత్తమమని సూచించారు. ద్రవ రూప యూరియా ద్వారా ఎరువుల వృథా తగ్గించడంతో పాటు పత్తి, మిర్చికి పోషకాలు సమృద్ధిగా అందుతాయన్నారు. ద్రవ రూప ఎరువులను వాడి యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైస్ ఎంపీపీ, పీఏసీఎస్ చైర్మన్

కోటపల్లి, అక్టోబర్ 4 : కోటపల్లి మండలం దేవులవాడ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త ఆసంపల్లి సంపత్ మరణించగా అతని కుటుంబాన్ని వైస్ ఎంపీపీ వాల శ్రీనివాస్ రావు, పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్ పరామర్శించారు. మృతుడి కుటుంబసభ్యులను వాల శ్రీనివాస్ రావు ఓదార్చారు. వారికి బాల్క ఫౌండేషన్ ద్వారా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బెల్లంకొండ సత్యనారాయణ రావు, పెంటుకారి నర్సింహులు, పిల్లి సమ్మయ్య, ఆసంపల్లి లచ్చయ్య, గడ్డి శంకర్, అంకయ్య, వెంకటి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## పోస్టాఫీస్ ఎదుట జీడీఎస్ ఉద్యోగుల ధర్నా



మందమర్రి : పోస్టాఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న జీడీఎస్ ఉద్యోగులు

మందమర్రి, అక్టోబర్ 4: కేంద్ర ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మందమర్రి (కల్యాణిఖని) సబ్ పోస్టాఫీస్ ఎదుట బుధవారం జీడీఎస్ ఉద్యోగులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎన్‌యూ జీడీఎస్ మెంబర్స్ జాఫర్ ఖాన్, శంకర్ లింగం మాట్లాడుతూ తపాలా విభాగంలో గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులు జీడీఎస్, పీజేసీఏ ఇచ్చిన పిలుపు మేరకు తాము ఒక్కరోజు ధర్నాలో పాల్గొన్నారని తెలిపారు. తమను కేంద్ర ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి 8 గంటల పని విధానం కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో కల్యాణిఖని సబ్ ఆఫీస్ పీఎం జీ పోచయ్య, పీఏ మహేందర్, యూపీఈపీఎం, డివిజన్ సెక్రటరీ జీ సుధాకర్ తోటి ఉద్యోగులు సంఘీభావం తెలిపారు.

## తాండూర్ మండలంలో..

తాండూర్, అక్టోబర్ 4 : ఆల్ ఇండియా నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ బ్యాంక్ సేవక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఒక్కరోజు సమ్మెలో తాండూర్ మండలంలోని తపాలా ఉద్యోగులు బుధవారం తాండూర్ సబ్ పోస్ట్ ఆఫీస్ వద్ద సమ్మెలో పాల్గొన్నారు. ఎనిమిది గంటల పని విధానం, పింఛన్ సహా, సీనియర్ జడీఎస్ ఉద్యోగులకు 12, 24. 36 సంవత్సరాల సర్వీస్ అదనపు ఇంక్రిమెంట్స్, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలని, గ్రాట్యూటీ రూ.5 లక్షలకు పెంచాలనే డిమాండ్లతో ఒక్కరోజు సమ్మె చేసినట్లు తపాలా ఉద్యోగుల సర్కిల్ ఆర్గనైజేషన్ సెక్రటరీ, తాండూర్ గ్రామీణ డాక్ సేవక్ అబ్దుల్ హక్ తెలిపారు. ఈ సమ్మెలో మాదారం, రేచిని, తాండూర్ శాఖల జీడీఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.



తాండూర్‌లో పోస్టాఫీస్ వద్ద సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

# పరిసరాల శుభ్రత పాటించాలి

- పారుపల్లి పాఠశాల హెచ్‌ఎం జీ యోగేశ్వర్



పారుపల్లి జడ్పీఎస్ఎస్‌లో శ్రమదానం చేస్తున్న సర్పంచ్, హెచ్‌ఎం, పంచాయతీ కార్యదర్శి, విద్యార్థులు

కోటపల్లి, అక్టోబర్ 4 : పరిసరాల శుభ్రత పాటించాలని పాఠశాల హెచ్‌ఎం గుండేటి యెగేశ్వర్ పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని పారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గాంధీ జయంతి సందర్భంగా శ్రమదానం చేశారు. పాఠశాల హెచ్‌ఎం గుండేటి యెగేశ్వర్ ఆధ్వర్యంలో పాఠశాలలో చెత్త తొలగింపు, శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, మొక్కల సంరక్షణపై హెచ్‌ఎం యోగేశ్వర్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూరెళ్ల వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# శ్రీరాంపూర్‌లో ఓటరు జాబితా ప్రదర్శన



శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన జాబితా

శ్రీరాంపూర్, అక్టోబర్ 4 : శ్రీరాంపూర్ ఏరియాలోని పోలింగ్ బూత్‌లలో బుధవారం తహసీల్దార్ ఇమ్రాన్, రెవెన్యూ సిబ్బంది ఫైనల్ ఓటర్ జాబితాను ప్రదర్శించారు. శ్రీరాంపూర్ కాలనీలోని సింగరేణి స్కూల్, పాత పంచాయతీ కార్యాలయం, తాళ్లపల్లి పాత పంచాయతీ ఆఫీస్, ప్రగతి స్టేడియం, విశ్వశాంతి హైస్కూల్, శారద శిశుమందిర్, కేరళా మోడల్ స్కూల్, శిశుమందిర్ స్కూళ్లలోని పోలింగ్ బూత్‌లలో తుది ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఇమ్రాన్ మాట్లాడుతూ ఓటర్లు వారి ఓటు ఉందో లేదో చూసుకోవాలని, లేకపోతే బీఎల్వోలను సంప్రదించాలని, లేదా మీ సేవ ద్వారా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ లిస్టుపై ఎలాంటి అభ్యంతరాలున్నా తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద జాబితాలో పేర్లను ఓటర్లు సరి చూసుకుంటున్నారు.

# పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



డ్రైనేజీ పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు

జన్నారం, అక్టోబర్ 4 : గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యం జరిగేలా చూడాలని అధికారులు, సిబ్బందిని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు ఆదేశించారు. బుధవారం మండలంలోని మహ్మదాబాద్, మల్యాల, దేవునిగూడ, కలమడుగు గ్రామాల్లో ఆకస్మికంగా తనిఖీ చేసి పంచాయతీ కార్యదర్శుల పనితీరును పరిశీలించారు. తడి, పొడి చెత్తను సేకరించి వేరు చేయాలన్నారు. సేంద్రియ ఎరువులు తయారు చేయాలన్నారు. రోడ్లు, డ్రైనేజీలు శుభ్రంగా ఉండేలా చూడడంతో పాటుగా శ్మశాన వాటికలో అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి సింగిడి రమేశ్, సర్పంచ్‌లు శిరీష, లక్ష్మణ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

## నేషనల్ సైన్స్‌ఫేర్‌కు ఎంపిక



కుషీంద్రవర్మ

లక్షెట్టిపేట, అక్టోబర్ 4 : ఈ నెల 9 నుంచి 11వరకు ఢిల్లీలో జరుగనున్న 10వ జాతీయ స్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు పట్టణానికి చెందిన కందుల కుషీంద్ర వర్మ ఎంపికయ్యాడు. మంచిర్యాల నుంచి కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఎంపిక కాగా స్థానిక గుడ్ షేపర్డ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కుషీంద్ర వర్మ ఈ పోటీలకు ఎంపికకావడంతో జిల్లా విద్యాధికారి యాదయ్య, సైన్స్ అధికారి మధుబాబు పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

## వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీపై అవగాహన




అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ శ్రీకాంత్

హాజీపూర్, అక్టోబర్ 5 : మండలంలోని గుడిపేట గ్రామంలోని రైతు వేదికలో బుధవారం బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ శ్రీకాంత్ మండలంలోని లబ్ధిదారులకు వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ రంగాల్లో వస్తున్న మార్పులు, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, చిరుధాన్యాల సాగు, సేంద్రియ వ్యవసాయం, మార్కెట్ రంగంలో వస్తున్న నూతన ఒరవడులు వర్మీ కంపోస్ట్ తయారీ, వాన పాముల రకాలు, ఎరువుల తయారీతో కలిగే లాభాలు, పోషక విలువలు, జీవ ఎరువులతో కలిగే లాభాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో గుడిపేట సర్పంచ్ లగిశెట్టి లక్ష్మి-రాజయ్య, నోడల్ ఆఫీసర్ సురేశ్, జేడీఎం రాంచందర్, ఏపీవో మల్లయ్య, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై సమీక్ష



తాండూర్: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

తాండూర్, అక్టోబర్ 4 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో హరితహారం, పండ్ల మొక్కల పెంపకం, పారిశుధ్యం, తదితర కార్యక్రమాలపై అభివృద్ధి పనులపై ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సమీక్షా నిర్వహించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సత్యనారాయణ, ఏపీవో నందకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లున్నారు.

## వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఎస్‌వో

హాజీపూర్, అక్టోబర్ 5 : వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ సెక్షన్ అధికారి హతవుల్లా అన్నారు. బుధవారం లక్షెట్టిపేట అటవీ రేంజ్‌లోని క్వారీలో అడవులు, వన్య ప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. వన్య ప్రాణులను వేటాడిన వారికి కఠిన శిక్షలను విధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో విజయ్ కుమార్, ఎఫ్‌బీవోలు తిరుపతి, రతన్ సింధు, సుభాష్, శ్రీనివాస్, ఉషోదయ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## దొనబండకు సబ్ స్టేషన్ మంజూరు

హాజీపూర్, అక్టోబర్ 5 : మండలంలోని దొనబండ గ్రామానికి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మాణానికి నిధులు రూ.2.23 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ సబ్‌స్టేషన్ ఏర్పాటుతో దొనబండ, పెద్దంపేట, బుద్ధిపల్లి, కొండాపూర్ రైతులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే దివాకర్ రావుకు ఆయా గ్రామాల ప్రజలు, వైస్ ఎంపీపీ బేతు రమ-రవి కృతజ్ఞతలు తెలిపారు.